RNI NO: APTEL/26/A7631

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 17 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజిలు : 4 వెల రూ. 2 బుధవారం -23 - సెప్టెంబర్ - 2026

Published From : Anatapuram circulated by YSR Kadapa I Chittoor I Kurnool I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

'దబాయించడం, బుకాయించడమే కాదు...

## ఎదురుదాడికి దిగుతున్నారు.



- ❖ఏపీలో ప్రజాస్వామ్యం ఉందా?: సజ్జల
- ❖డీఎస్సీలో అక్రమాలు చేసి, ఆ తప్పుల నుంచి బయటపడేందుకే వెన్నుపోట్ల పార్టీ దాడుల్ని కొనసాగిస్తోందని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ❖ఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వ ఆటలు సాగవని. న్యాయ స్థానాల ద్వారా పోరాడుతామని ఆయన హెచ్చరించారు.

డీఎస్సీలో అక్రమాలు చేసి, ఆ తప్పుల నుంచి బయటపడేందుకే వెన్నుపోట్ల పార్టీ దాడుల్ని కొనసాగిస్తోందని మిగతా 2లో

'సర్' ప్రక్రియ పేరుతో

## వికృత చేష్టలకు పాల్పడుతున్నారు



- ➤సర్ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారన్న నారాయణ
- ➤అద్వానీ, జైశంకర్ వంటి ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేశారని విమర్శ
- ➤వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడాన్ని కూడా పెద్ద సమస్యగా చూపుతున్నారని మండిపాటు

ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన (సర్) పేరుతో చేపడుతున్న వింత, వికృత చర్యలు ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాపాడేలా లేవని, విజ్ఞతలేని తీరుతో ఓటర్లను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ మిగతా 2లో

- ➤నారావారిపల్లి జన్మనిస్తే.. కుప్పం రాజకీయ జన్మనిచ్చింది : సీఎం చంద్రబాబు
- ➤జూనియర్ డాక్టర్లకు ఏపీ సర్కార్ శుభవార్త.. స్టైఫండ్ పెంచుతూ ఉత్తర్వులు జారీ
- ➤ఆయన జ్ఞాపకాలు మదిలో నిలిచి ఉంటాయి: శివప్రసాద్‌పై చంద్రబాబు
- ➤మాజీ ఎంపీ నరమల్లి శివప్రసాద్ వర్ధంతి
- ➤నివాళులర్పించిన సీఎం చంద్రబాబు
- ➤శివప్రసాద్ తన చిన్ననాటి స్నేహితుడని పేర్కొన్న ముఖ్యమంత్రి
- ➤మంత్రిగా, ఎంపీగా ప్రజాసేవతో పాటు సినిమా, నాటక రంగంలో ప్రత్యేకతను చాటుకున్నారన్న చంద్రబాబు

నా పాలనలో ఏ డీఎస్సీలోనూ

# అవకతవకలు జరగలేదు

ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి.. సాక్ష్యాధారాలతో నిరూపిస్తాం



కుప్పంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డీఎస్సీ నిర్వహణపై ప్రతిపక్షాలు కావాలని అబద్ధపు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. డీఎస్సీకి అసలైన చిరునామా చంద్రబాబు, టీడీపీయేనని, 16 వేల మందికి పైగా మిగతా 2లో

- ★ఆర్థిక వనరుల సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి
- ★కీలక ప్రాజెక్టులకు నిధుల కోసం ప్రైవేటు పెట్టుబడులపై దృష్టిపెడతాం... పెట్టుబడిదారుల నష్టభయం తగ్గించేలా ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగిస్తాం
- ★30 వేల ఎకరాల్లో నెట్-జీరో మెగాసిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ
- ★తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఇకపై కేవలం ప్రభుత్వ రుణాలపైనే ఆధారపడే పాత విధానానికి స్వస్తి పలుకుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.
- ★మౌలిక వసతుల కల్పనకు నిధులు సమకూర్చుకొనే విధానంలో కచ్చితమైన మార్పు రావాలని ఆయన పేర్కొన్నారు.
- ★ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో ఢిల్లీలో శనివారం జరిగిన 'వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ'సదస్సులో తెలంగాణ నుంచి భట్టి విక్రమార్కతోపాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌లో

# తెలంగాణ కీలకం

ఇక అప్పులపైనే ఆధారపడం



తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఇకపై కేవలం ప్రభుత్వ రుణాలపైనే ఆధారపడే పాత విధానానికి స్వస్తి పలుకుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు సమకూర్చుకొనే విధానంలో కచ్చితమైన మార్పు రావాలని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో ఢిల్లీలో శనివారం జరిగిన 'వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణానికి మిగతా 2లో

## కర్బన ఉద్గారాలపై అభివృద్ధి చెందుతున్న దేశాలనే నిందించడం సరికాదు

- ●వాతావరణంలో కలుస్తున్న కర్బన ఉద్గారాలకు బాధ్యతను అభివృద్ధి చెందుతున్న దేశాలపైనే పెట్టడం సరికాదని ప్రధాని మోదీ అన్నారు.
- ●ఇందుకు కారణం అవుతున్న దేశాలను వదిలేసి ప్రతిసారీ భారత్ వంటి దేశాలనే నిందిస్తున్నారన్నారు.



వాతావరణంలో కలుస్తున్న కర్బన ఉద్గారాలకు బాధ్యతను అభివృద్ధి చెందుతున్న దేశాలపైనే పెట్టడం సరికాదని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు కారణం అవుతున్న దేశాలను వదిలేసి ప్రతిసారీ భారత్ వంటి దేశాలనే నిందిస్తున్నారన్నారు. మిగతా 2లో

ఎండాకాలం బూచి చూపి

## రైతులకు నీళ్లివ్వరా?



- ❄జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే నీటిని విడుదల చేయాలన్న డీకే అరుణ
- ❄జలాశయంలో ప్రస్తుతం సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని వెల్లడి
- ❄రైతులు చేపట్టిన ఆందోళనలకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టీకరణ

పాలమూరు జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి నీటి కోసం రైతాంగం అల్లాడుతుంటే, రాబోయే ఎండాకాలాన్ని బూచిగా చూపి కాలువలకు నీటిని నిలిపివేయడం ఏమాత్రం సమంజసం కాదని మిగతా 2లో

గురువులపై గొడ్డలి పార్టీ నాయకుల

## దాడులు క్షమించరాని నేరం



- ⌘మెగా డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదు
- ⌘ఇదే మాట స్పష్టం చేసిన హైకోర్టు, విద్యాశాఖాధికారులు
- ⌘లిక్కర్ కేసుల నుంచి డైవర్షన్ కోసం దాడులు
- ⌘జగన్ కు దమ్ము, ధైర్యం ఉంటే చర్చకు రావాలి
- ⌘మెగా డీఎస్సీపైనా, గ్రూప్ 1 మూల్యాంకనంపైనా చర్చకు రెడీ
- ⌘జగన్ మాటలు నమ్మితే జైలుకే...
- ⌘రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- ⌘వైసీపీ క్యాడర్ కు మంత్రి సవిత హెచ్చరిక

'గురు బ్రహ్మ, గురు విష్ణుః, గురు దేవో మహేశ్వరః అంటూ గురువులను దైవంగా కొలుచుకునే సమాజం మనదని, అటువంటి దైవాలపై గొడ్డలి పార్టీ గూండాలు దాడి చేయడం దారుణం... ఒకవైపు లిక్కర్ స్కామ్, మరో వైపు గ్రూప్ 1 పోస్టుల మూల్యాంకనంలో అక్రమాలు బయటకు రావడంతో జగన్ బ్యాచ్ లో గగ్గోలు మొదలైంది... టీచర్ల ఆత్మగౌరం దెబ్బతిసేలా, వారిని కష్టాన్ని తక్కువ చేసి చూపేలా మెగా డీఎస్సీలో అక్రమాలు అంటూ విష ప్రచారం మిగతా 2లో

## "మున్సిపల్ ఎన్నికల్లో అంతకన్నా ఎక్కువ సీట్లు గెల్చుకోవాలి"

- ●గుంటూరులో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు.
- ●గుంటూరులో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది.



గుంటూరులో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గుంటూరులో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. మిగతా 2లో

## దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయి

టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం

- ●స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- ●దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- ●రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ●ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు



విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ మూకలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## జూరాల ఆయకట్టు పంటలను కాపాడాలి



రైతుల పక్షాన పోరాడుతున్న నేతల అరెస్టు దుర్మార్గం

కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సిందిపోయి న్యాయమైన డిమాండ్‌తో నిరసనకు సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ సర్కారు కుట్ర చేస్తోందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో మండిపడ్డారు.

కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సిందిపోయి

పిఠాపురంలో రూ. 6 కోట్లతో

# 11 చెరువుల ఆధునీకరణ

మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్

- ●పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన
- ●ఫక్రుద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం
- ●గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక
- ●రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్



సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫక్రుద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిగతా 2లో

## ఉపాధ్యాయులను రాజకీయాల్లోకి లాగడం దారుణం : సుధాకర్



రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 22 : ఉపాధ్యాయులను రాజకీయాల్లోకి లాగడం దారుణం అని రాయచోటి రూరల్ మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ అన్నారు. రాయచోటిలోని టీడీపీ కార్యాలయంలో సుధాకర్ మాట్లాడుత డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వస్తున్న ఆరోపణలకు ఉపాధ్యాయులే వివిధ ప్రాంతాల్లో స్పందించారని తెలిపారు. కర్నూలు కొండారెడ్డి బురుజు, విజయవాడలో అంబేద్కర్ విగ్రహం, విశాఖ సముద్ర తీరం వద్ద తమ ఉద్యోగాలు తమ కష్టార్జితం అని ఉపాధ్యాయులు స్పష్టం చేశారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదం వల్ల గంజాయి, డ్రగ్స్ మత్తులో బరితెగించిన అల్లరి మూకలు దాడులకు తెగబడుతుంటే, టీచర్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విద్యార్థులకు విద్యను బోధిస్తున్నారని తెలిపారు. అలాంటి ఉపాధ్యాయులను సైతం గత ప్రభుత్వం కరోనా సమయంలో బ్రాందీ షాపుల వద్ద నిలబెట్టిన ఘనత కూడా వారికే దక్కుతుందన్నారు. ప్రతి నిజాన్ని అబద్ధం అని చెప్పి, అబద్ధాన్ని నిజం చేయాలని చూస్తున్న వైసీపీకి యావత్ రాష్ట్ర ఉపాధ్యాయులందరూ బుద్ధి చెప్పే రోజు దగ్గరపడిందని హెచ్చరించారు. తమ గౌరవానికి భంగం కలిగించ వద్దంటూ ఉపాధ్యాయులు సమావేశాలు, నిరసనలు చేపట్టాల్సి రావడం మన రాష్ట్ర దౌర్భాగ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోటకొండ రవి శంకర్ పాల్గొన్నారు.

## జమ్మలమడుగులో మున్సిపల్ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ సెప్టెంబర్ 22: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధిలో భాగంగా రోడ్లు, డివైడర్లు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎర్రగుంట్ల, జమ్మలమడుగు మున్సిపాలిటీలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, జమ్మలమడుగు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి మీడియా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.38 కోట్లు

### రోడ్లు, డివైడర్లు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత



కడప జిల్లా/జమ్మలమడుగు, సెప్టెంబర్ 22, (మహి న్యూస్) మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని జమ్మలమడుగు ఎమ్మెల్యే



ఆదినారాయణరెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయంలో హ్యామ్ పథకంలో భాగంగా జమ్మలమడుగు మున్సిపాలిటీకి రూ.22 కోట్లు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీకి రూ.16 కోట్లతో



చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేష్ సుబ్బరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు. మున్సిపాలిటీల్లో ప్రధానంగా రోడ్లు, డివైడర్లు, వీధి దీపాలు, పార్కులు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడు జగన్ అభివృద్ధి పనులను అడ్డుకుంటూ అభివృద్ధికి ఆటంకంగా మారారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి లడ్డూకు రూ.1.01 లక్షల ధర

### పావని సర్కిల్‌లో వేలం పాటలో దక్కించుకున్న రేవనూరి రాజకుమార్



గాలివీడు: సెప్టెంబర్22(మహి న్యూస్): గాలివీడు పావని సర్కిల్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూ ప్రసాదానికి వేలం పాటలో భారీ ధర పలికింది. భక్తుల సమక్షంలో నిర్వహించిన వేలం పాటలో రేవనూరి రాజకుమార్ రూ.1,01,000లకు లడ్డూను దక్కించుకున్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పావని సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లడ్డూ వేలం పాటను ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులు, స్థానికులు వేలం పాటలో పాల్గొనగా రేవనూరి రాజకుమార్ అత్యధికంగా రూ.1.01 లక్షలు పాట పాడి లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రేవనూరి రాజకుమార్‌ను అభినందించారు. వినాయకుడి ఆశీస్సులతో కుటుంబ సభ్యులకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఉద్యోగి సస్పెన్షన్‌పై జిల్లా కోర్టు ఉత్తర్వులు



కడప, సెప్టెంబర్ 22 (మహి న్యూస్): రాయచోటి ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో ఫీల్డ్ అసిస్టెంట్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తూ, సిద్దవటం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో విధులు నిర్వహిస్తున్న ఎన్. మున్నాజి రావును సస్పెండ్ చేస్తూ కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి, క్రమశిక్షణాధికారి జి. రామ గోపాల్ సెప్టెంబర్ 21న ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత క్రిమినల్ కేసుల నేపథ్యంలో సెప్టెంబర్ 11న ఆయనను అరెస్ట్ చేసి న్యాయ కస్టడీకి తరలించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనంతరం సెప్టెంబర్ 18న బెయిల్‌పై విడుదలైనట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనలు, 1991లోని రూల్ 8(2)(ఎ) ప్రకారం సెప్టెంబర్ 11 నుంచి అమల్లోకి వచ్చే విధంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ కాలంలో నిబంధనల ప్రకారం జీవన భృతి పొందేందుకు ఆయన అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా, సిద్దవటం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సంబంధిత వివరాలు, ఆధారాలతో కూడిన సమగ్ర నివేదికను 15 రోజుల్లో సమర్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశించారు.

## నూతన జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఆర్అండ్‌బీ సూపరింటెండింగ్ ఇంజనీర్



కడప, సెప్టెంబర్ 22 (మహి న్యూస్): కడప జిల్లాకు నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన జిల్లా ప్రధాన మరియు సెషన్స్ న్యాయమూర్తి జి. రామ గోపాల్ను రహదారులు, భవనాల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. చంద్రశేఖర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా ప్రధాన న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్ప మొక్కను అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో న్యాయశాఖకు సంబంధించిన భవనాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై ఇరువురు పరస్పరం చర్చించారు.

## జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..!

### జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 22: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి






మల్లికార్జునుడు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా స్థాయి కార్యాచరణ బృందం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నులి పురుగుల నివారణ మందు అందించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 2 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు 200 మిల్లీగ్రాముల ఆల్బెండజోల్, 3 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు 400 మిల్లీగ్రాముల ఆల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్న భోజనం అనంతరం మింగించాలని సూచించారు. పాఠశాలలకు వెళ్లని పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు అందించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 25న, అలాగే మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు అక్టోబర్ 5న నులి పురుగుల నివారణ మందు అందించే కార్యక్రమం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. నులి పురుగుల నివారణతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. గోర్లు క్రమం తప్పకుండా కత్తిరించుకోవడం, భోజనానికి ముందు, మల విసర్జన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, కాళ్లకు చెప్పులు ధరించడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకుండా మరుగుదొడ్లను వినియోగించడం వంటి అంశాలపై ఆరోగ్య విద్య ద్వారా అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు సమన్వయంతో పనిచేయాలని అధికారులు కోరారు. కార్యక్రమ ప్రాముఖ్యతను తెలియజేస్తూ గోడపత్రాలను కూడా విడుదల చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, జెడ్పీ సీఈఓ, జాయింట్ డైరెక్టర్ (సాంఘిక సంక్షేమం), జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్య సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్, డా. జె. ప్రవీణ్ కుమార్, డీఐఓ, డా. ఎస్. అరీఫుల్లా, పీవో ఆర్‌బీఎస్‌కే/ఎన్‌సీడీ డా. ఎం. తాహా, డీపీఎంఓ ఎన్‌హెచ్‌ఎం డి. భారతి, జిల్లా మాస్ మీడియా విస్తరణ అధికారి ఎన్. నవీన్ కుమార్, కార్యక్రమ నిర్వాహకుడు ఆర్‌బీఎస్‌కే ఎం. రామమూర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా లో ఉద్యాన పంటలను ప్రోత్సహించేలా అన్నీ చర్యలు తీసుకుంటున్నాం...

### - జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి.

### వెలిదండ్ల గ్రామంలో అవకాడో పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్.

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 22: పులివెందుల నియోజకవర్గం, లింగాల మండలం, వెలిదండ్ల గ్రామంలో రైతు కర్నా వరదారెడ్డి సాగు చేస్తున్న అవకాడో పంటను మంగళవారం జిల్లా





కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా అవకాడో తోటను సందర్శించిన కలెక్టర్, పంట సాగు విధానం, పెట్టుబడి వ్యయం, దిగుబడి, మార్కెట్ ధరలు, రైతుకు లభిస్తున్న ఆదాయం తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. అవకాడో వంటి అధిక పోషక విలువ కలిగిన ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను సూచించారు. పంట ఎంపిక నుంచి సాగు, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణ, కోత అనంతర నిర్వహణ, మార్కెటింగ్ వరకు రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలను ఉద్యానశాఖ అధికారులు అందించాలని ఆదేశించారు. అలాగే అవకాడో సాగుకు అనుకూలమైన భూములు, నీటి వనరులు ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆసక్తి ఉన్న రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేసే విధానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో అవకాడో సాగును విస్తరించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన పంటల ప్రోత్సాహకాలు, రాయితీలు మరియు ఇతర పథకాలపై రైతులకు పూర్తి సమాచారం అందించి, అర్హులైన రైతులు వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెలిదండ్ల గ్రామంలో అవకాడో సాగు చేస్తున్న రైతు అనుభవాలను ఇతర రైతులకు కూడా తెలియజేసి,



జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని మెరుగుపరిచే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పంటకు మార్కెటింగ్ సదుపాయాలు, గిట్టుబాటు ధరలు లభించేలా రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని, పంట ఉత్పత్తిని నాణ్యతా ప్రమాణాలతో మార్కెట్‌కు తీసుకెళ్లే విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుబ్రమణ్యేశ్వర రావు, ఉద్యాన శాఖాధికారి హరి ప్రసాద్, డ్వామా పిడి ఆదిశేషారెడ్డి, ఎపిఎంఐపి పిడి రమణ, మాజీ శాసన మండలి సభ్యులు రవీంద్ర నాద్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల అభివృద్ధికి రూ.20 కోట్లతో పనులు

### మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత: కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప జిల్లా/పులివెందుల, సెప్టెంబర్ 22 (మహి న్యూస్): పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 121 పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో రూ.11,360 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి మంగళవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా పులివెందుల పురపాలక సంఘ పరిధిలో రూ.20 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక పురపాలక సంఘ కార్యాలయ వేదికగా కలెక్టర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణాల్లో తాగునీరు, మురుగునీటి కాలువలు, రహదారులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 9 పురపాలక సంఘాల పరిధిలో గత ఆరు నెలల్లో సుమారు రూ.1,500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు.




పులివెందుల పురపాలక సంఘ పరిధిలో మరో రూ.40 కోట్ల పట్టణ అభివృద్ధి నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.11.90 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పనులను రానున్న ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**రూ.480 కోట్ల తాగునీటి పథకం**

పులివెందుల ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో లింగాల మండలం పార్నపల్లి వద్ద రూ.480 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పులివెందుల తాగునీటి సరఫరా పథకం పనులు దాదాపు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఈ నెలాఖరులోగా పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు



తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా 299 గ్రామాలతో పాటు పులివెందుల పురపాలక సంఘ పరిధిలోని ప్రజలకు తాగునీటి అవసరాలు తీరనున్నాయని వివరించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పురపాలక శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి చిన్నయ్య, పురపాలక కమిషనర్ తనూజ, మాజీ శాసన మండలి సభ్యులు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు పొరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రూ.480 కోట్లతో పులివెందుల తాగునీటి పథకం

### పనుల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



కడప/పులివెందుల సెప్టెంబర్ 22 (మహి న్యూస్): పులివెందుల ప్రాంత ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో రూ.480 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న పులివెందుల తాగునీటి సరఫరా పథకం పనులను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మంగళవారం పరిశీలించారు. లింగాల మండలం పార్నపల్లి గ్రామం వద్ద జరుగుతున్న పథకం నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్.. త్వరలో పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.





పథకంలో చేపడుతున్న వివిధ పనులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, ఇంకా పూర్తి చేయాల్సిన పనులపై అధికారులతో సమీక్షించారు. పులివెందుల ప్రాంత ప్రజలకు నిరంతరాయంగా, సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, డీపీఓ రామచంద్ర, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, మాజీ శాసన మండలి సభ్యుడు రవీంద్రనాథ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.



## స్మార్ట్ కిచెన్లతో మధ్యాహ్న భోజన పథకంలో నూతన అధ్యాయం..

### - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.



కడప జిల్లా /పులివెందుల, మహి న్యూస్ సెప్టెంబర్, 22 : ప్రతి విద్యార్థికి నాణ్యమైన, పరిశుభ్రమైన, వేడివేడి భోజనం అందించడమే లక్ష్యంగా.. గతంలో వంట ఏజెన్సీల నిర్వహణలో ఎదురైన లోపాలను అధిగమిస్తూ.. జిల్లాలో అమలు చేస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ మధ్యాహ్న భోజన పథకంలో గుణాత్మక మార్పుకు నాంది పలుకుతోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. మంగళవారంవారం పులివెందుల మున్సిపల్ పాఠశాలలో నూతనంగా అమలులోకి తీసుకువచ్చిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ నిర్వహణ, అమలు తీరును జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అత్యాధునిక సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్





వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో మధ్యాహ్న భోజన పథకం చిన్నచిన్న వంట ఏజెన్సీల నిర్వహణలో ఉండడంతో పరిశుభ్రత, ఆహార నాణ్యత, పరిమాణం, సమయానికి సరఫరా వంటి అంశాల్లో కొన్ని సమస్యలు ఎదురయ్యేవని అన్నారు. ఆ పరిస్థితులకు పూర్తిగా స్వస్తి పలికేలా జిల్లాలో వినూత్నంగా సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ విధానాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. జిల్లా కలెక్టర్ వెంట విద్యా శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com తెలుగు దినపత్రిక


# పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్



పుట్టపర్తి, సెప్టెంబర్ 22: (మహి న్యూస్): విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికిన ఎంపీ బీకే పార్థసారథి, మంత్రి ఎస్. సవిత, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణి, దగ్గుపాటి వెంకట ప్రసాద్, ఎం.ఎస్. రాజు మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, నేతలు ఆలం నర్సానాయుడు, కేశవ్ రెడ్డి తదితరులు హాజరు నేడు రాప్తాడు నియోజకవర్గంలో మంత్రి లోకేష్ పర్యటన రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాలను ఆవిష్కరించనున్న మంత్రి లోకేష్ అనంతరం రాప్తాడు నియోజకవర్గ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో పాల్గొననున్న మంత్రి లోకేష్



# ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రత ఉండాలి

## ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు భద్రతా చర్యలు చేపట్టాలి



అనంతపురం, సెప్టెంబర్ 22: (మహి న్యూస్): ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మంగళవారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణం పక్కన ఉన్న ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రత, గోడౌన్ల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, లాక్ బుక్‌లను కలెక్టర్ పరిశీలించారు. గోడౌన్ల వద్ద ఎలాంటి లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఏ. మాలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనకరాజ్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి శ్రీనివాసరావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మసూద్ వలి, కాంగ్రెస్ ప్రతినిధి ఇమామ్, సీపీఐ(ఎం) ప్రతినిధి రామాంజనేయులు, బీజేపీ ప్రతినిధి శ్యామ్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల 23, 24న అనంతపురం జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల పర్యటన

## బాలల సంరక్షణ కేంద్రాలు, పాఠశాలల్లో తనిఖీలు

## వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష



అనంతపురం, సెప్టెంబర్ 22: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన్ రావు ఈనెల 23, 24 తేదీల్లో అనంతపురం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు.

### 23న వివిధ కేంద్రాల్లో తనిఖీలు

ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గిరిజన సంక్షేమ వసతి గృహాలు, సమగ్ర బాలల అభివృద్ధి సేవల కేంద్రాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, బాలల సంరక్షణ సంస్థల్లో తనిఖీలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి, మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం జిల్లాలో బస చేస్తారు.

### 24న పాఠశాలల్లో తనిఖీలు

ఈనెల 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనంతపురం కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, బాలల న్యాయ మండలి, ఆహార భద్రత, వైద్య ఆరోగ్యం, విద్య, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, పురపాలక, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమం, కార్మిక, పోలీస్, రవాణా తదితర శాఖల అధికారులు సమావేశానికి హాజరవుతారు. అలాగే గ్రామ, వార్డు స్థాయి బాల్య వివాహాల నిరోధక కమిటీలు, తాగునీటి సరఫరా, ఇతర సంబంధిత శాఖల పనితీరుపై కూడా సమీక్ష నిర్వహించనున్నారు. సమీక్ష అనంతరం సాయంత్రం 5.30 గంటలకు అనంతపురం జిల్లా నుంచి బయలుదేరి అన్నమయ్య జిల్లాకు వెళతారని కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు.

# అనంతపురం నగర అభివృద్ధికి రూ.50 కోట్లతో పనులు

## రహదారులు, పార్కులు, డివైడర్లు, వీధి దీపాల ఏర్పాటుకు నిధులు

## వచ్చే నెలలో రూ.160 కోట్లతో మురుగునీటి కాలువల నిర్మాణం

**- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**



అనంతపురం, సెప్టెంబర్ 22: (మహి న్యూస్): అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో హైబ్రిడ్ యాన్యుటీ నమూనా పథకం కింద రూ.50 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ నమూనా పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో రూ.11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని కార్యక్రమంలో తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాలు, 106 నియోజకవర్గాల్లోని 123 మున్సిపాలిటీల్లో పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

### రోడ్లు, పార్కులు, వీధి దీపాల అభివృద్ధి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అనంతపురం నియోజకవర్గంలో రూ.1,300 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతపురం నగరంలో ఓల్డ్ టౌన్ సహా అన్ని ప్రాంతాలకు ప్రతిరోజూ తాగునీరు అందించడంతో పాటు మురుగునీటి శుద్ధి కోసం రూ.107.71 కోట్లతో భారీ శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. తాజాగా మంజూరైన రూ.50 కోట్లతో నగరంలో రహదారులు, పార్కులు, డివైడర్లు, వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వచ్చే నెలలో మరో రూ.160 కోట్లతో మురుగునీటి కాలువల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. స్థానిక సంస్థలకు వచ్చే ఆదాయాన్ని ఆయా స్థానిక సంస్థల పరిధిలోనే అభివృద్ధి పనులకు వినియోగించుకునేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే తెలిపారు. నగరంలోని 62 డివిజన్లలో అభివృద్ధి పనులు కనిపించేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శాఖల అధికారులు పి.ఎల్.ఎన్. మూర్తి, పరమేష్, కొండన్న, దాసరి చంద్రకళ, ప్రశాంతి, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్-44ను 4 లేన్ల నుంచి 6 లేన్లుగా విస్తరించాలి

## వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను త్వరితగతిన పూర్తి చేయాలి

## సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశం



అనంతపురం, సెప్టెంబర్ 22: (మహి న్యూస్): ఎన్‌హెచ్-44 రహదారిని 4 లేన్ల నుంచి 6 లేన్లుగా విస్తరించేందుకు అవసరమైన లివివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లిను త్వరితగతిన సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఎన్‌హెచ్-44 విస్తరణపై జాతీయ రహదారులు, రోడ్లు--భవనాలు, పంచాయతీరాజ్, ఏపీఎస్పీడీసీఎల్, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్-44ను 4 లేన్ల నుంచి 6 లేన్లుగా విస్తరించేందుకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక తయారీ పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని అధికారులు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. పనులను మరింత వేగవంతం చేసి, నివేదికను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. విస్తరణకు సంబంధించిన అంశాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ తరుణ్ కుమార్, భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ స్థల ఇంజనీర్ సాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అండర్-19 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికైన కిరణ్ కుమార్‌కు ప్రోత్సాహం

## జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అభినందనలు

## 1.39 లక్షల ఆర్థిక సహాయం అందించిన వయోజన విద్యా శాఖ సిబ్బంది





అనంతపురం, సెప్టెంబర్ 22: (మహి న్యూస్): అనంతపురం జిల్లాకు చెందిన తలారి కిరణ్ కుమార్ అండర్-19 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం పట్ల జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో కిరణ్ కుమార్‌ను అభినందించి, అతని భవిష్యత్ క్రీడా ప్రస్థానానికి శుభాకాంక్షలు తెలిపారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన కిరణ్ కుమార్ క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

### 1.39 లక్షల ఆర్థిక సహాయం

కిరణ్ కుమార్ తల్లి లక్ష్మీ ప్రసన్న వయోజన విద్యా శాఖలో ఒప్పంద ప్రాతిపదికన సమాచార నమోదు నిర్వాహకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా కిరణ్ కుమార్ క్రీడా భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా తమ శాఖ తరపున సహాయ సహకారాలు అందిస్తామని వయోజన విద్యా శాఖ ఉపసంచాలకులు ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. కిరణ్ కుమార్‌ను ప్రోత్సహించేందుకు ఉపసంచాలకులు, శాఖ సిబ్బంది కలిసి రూ.1,39,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ చేతుల మీదుగా కిరణ్ కుమార్‌కు అందజేశారు. వయోజన విద్యా శాఖ సిబ్బంది చూపిన దాతృత్వాన్ని జిల్లా కలెక్టర్ అభినందించారు. కిరణ్ కుమార్ క్రీడా రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వయోజన విద్యా శాఖ సహాయ సంచాలకులు బీవీ.భాస్కర్ రెడ్డి, సిబ్బంది జనార్ధన్ గౌడ్, సూర్యనారాయణ, శ్రీధర్, పరమేశరప్ప, రవి, సుధాకర్, రమణ, గణేష్, ప్రభాకర్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# తల్లి బిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన బాల్యం

## గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## పుప్పాల తాండాలో జాతీయ పోషణ్ మాసోత్సవ అవగాహన కార్యక్రమం



యాడికి, సెప్టెంబర్ 22: (మహి న్యూస్): తల్లి, బిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని తాడిపత్రి సమీకృత శిశు అభివృద్ధి సేవల ప్రాజెక్టు ఇన్‌చార్జ్ బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి విజయకుమారి తెలిపారు. యాడికి మండలం పుప్పాల తాండాలో మంగళవారం 9వ జాతీయ పోషణ్ మాసోత్సవంలో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ ప్రతి గర్భిణీ, బాలింత పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండేలా ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లులు, పిల్లలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్య పరిరక్షణకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం పోషణ్ మాసోత్సవాలను నిర్వహిస్తూ పోషకాహారం, ఆరోగ్యం, బాలల వికాసంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.



### పోషక వంటకాల తయారీపై ప్రదర్శన

అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు ప్రతినెలా అందించే బాల సంజీవిని కిట్ (ఇంటికి తీసుకెళ్లే ఆహార సరుకుల ప్యాకెట్)తో పోషక విలువలు తగ్గకుండా వివిధ రకాల పోషక వంటకాలను ఎలా తయారు చేసుకోవాలో స్వయంగా ప్రదర్శన ద్వారా వివరించారు. ఆహార వైవిధ్యం--తగినంత ప్రోటీన్, 'మన అంగన్వాడీ--మన బాధ్యత' అనే ప్రధాన అంశాలతో తల్లులకు పోషకాహారంపై అవగాహన సదస్సులు, పోషణ మేళాలు, పోషక వంటకాల ప్రదర్శనలు, అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం, ఆరోగ్యం, బాలల వికాసం, సమాజ భాగస్వామ్యంపై వివిధ కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

### పప్పుధాన్యాలు, ఆకుకూరలు తీసుకోవాలి

రోగనిరోధక శక్తిని పెంచే పప్పుధాన్యాలు, ఆకుకూరలు, ప్రోటీన్ సమృద్ధిగా ఉండే పోషకాహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని విజయకుమారి సూచించారు. తాండా వాసులు తమ కుటుంబాల్లోని తల్లులకు పోషకాహారం, ఆహార నియమాలపై అవగాహన కల్పించాలని కోరారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు విద్యే పునాది అని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం పిల్లలకు ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించడంలో దోహదపడుతుందని తెలిపారు. పోషకాహారంపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

### అనంతరం గర్భిణీలకు బాలామృతం అందజేశారు.

కార్యక్రమంలో జిల్లా సహాయ ప్రాజెక్టు అధికారి, ప్రచార విభాగం అధికారి ఫక్రుద్దీన్, స్థానిక నాయకులు జయరాం నాయక్, పర్యవేక్షకులు శంషాద్ బేగం, నాగేశ్వరి, వెంకటలక్ష్మి, అంగన్వాడీ ఉపాధ్యాయులు నాగలక్ష్మి, ప్రమీల, మల్లేశ్వరి, రుక్మిణి, వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, ఆశా కార్యకర్తలు, గిరిజన తాండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి బృహత్తర అడుగు



మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబర్ 22: పట్టణ ప్రాంతాల్లో ఆధునిక మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగా జిల్లాలోని 4 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం రూ.94 కోట్ల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్)లో వివిధ మౌలిక వసతుల అభివృద్ధి పనులకు నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్)లో తొలిసారిగా రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 106 నియోజకవర్గాల్లోని 123 మున్సిపాలిటీలలో ఒకేసారి రూ.11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంగళవారం కుప్పం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ గా శంకుస్థాపన చేసి పట్టణాల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల్లో రోడ్లు, సెంట్రల్ మీడియన్లు, పార్కులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ నిధులను ఖర్చు చేయడం జరుగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. స్థానిక ఎన్‌వీఆర్ కళ్యాణ మండపంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వర్చువల్ గా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, బి.కొత్తకోట, పుంగనూరు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం రూ.94 కోట్ల విలువైన పనులకు ప్రభుత్వ ఆమోదం లభించిందన్నారు. ఇందులో మదనపల్లె మున్సిపాలిటీకి రూ.27 కోట్లు, రాయచోటికి రూ.35 కోట్లు, బి.కొత్తకోటకు రూ.12 కోట్లు, పుంగనూరుకు రూ.20 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అన్నమయ్య జిల్లాలోని నాలుగు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులు పట్టణాల రూపురేఖలను మార్చడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. జిల్లాకేంద్రంగా మదనపల్లె ఏర్పడిన అనంతరం పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజల నుంచి జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిన వివిధ విజ్ఞప్తులను ప్రభుత్వానికి నివేదించామని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని అన్నారు. జిల్లాకేంద్రానికి అవసరమైన ముఖ్యమైన రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి జిల్లా మినరల్ ఫౌండేషన్ (ఐఎమ్‌ఎఫ్) నిధులను వినియోగిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా మదనపల్లె పట్టణంలోని సీటీఎం రోడ్డు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ఇప్పటికే వెట్‌మిక్స్ పనులు పూర్తయ్యాయని, తుది దశలో బీటీ రోడ్డు పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పారు. మరో పది రోజుల్లో ఈ పనులు కూడా పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. సీటీఎం రోడ్డును డబుల్ లేన్‌గా అభివృద్ధి చేయడం ద్వారా పట్టణ కేంద్రంలో మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. స్థానిక శాసనసభ్యుల విజ్ఞప్తి మేరకు ఉపాధి హామీ పథకం కింద మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి సుమారు రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే జిల్లా మినరల్ ఫౌండేషన్ ద్వారా మదనపల్లె జిల్లాకేంద్ర అభివృద్ధికి గత నెలలో సుమారు రూ.10 నుంచి రూ.20 కోట్ల వరకు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) కింద సుమారు రూ.27 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఈరోజు పరిపాలనా అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద ఇప్పటికే సుమారు రూ.35 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని చెప్పారు.

### పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కీలకం

స్వచ్ఛ భారత్ మిషన్ కింద తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన ప్లాట్‌ఫారమ్‌ల నిర్మాణానికి సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు కాగా, పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలవుతున్న అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యుఐడిఎఫ్) కింద తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు సుమారు రూ.56 కోట్ల ప్రతిపాదనలు అనుమతి దశలో ఉన్నాయని వివరించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం సిబ్బంది నిరంతరం కష్టపడుతున్నప్పటికీ, ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి మునిసిపల్ కమీషనర్ ప్రమీల, టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్, మదనపల్లె శాసనసభ్యులు షాజహాన్ బాషా కుమారుడు మహమ్మద్ జుబేద్ అక్బర్, వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ నవీన్, నాయకులు రాజన్న, రఘుపతి, నీలకంఠ, సంబంధిత మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హానికర వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలి..!

## ఏపీఈఎంసీఎల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి





కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 22: హానికర వ్యర్థాల సహ-ప్రాసెసింగ్‌లో పర్యావరణ నిబంధనలు, మార్గదర్శకాలు, భద్రతా ప్రమాణాలను పరిశ్రమలు కచ్చితంగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఈఎంసీఎల్) చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి సూచించారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో రెండు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా మంగళవారం మైలవరం మండలం చిన్నకొమెర్ల పరిధిలోని డాల్మియా సిమెంట్స్ (భారత్) లిమిటెడ్ పరిశ్రమను ఏపీఈఎంసీఎల్ చైర్మన్ సందర్శించారు. పరిశ్రమలోని హానికర వ్యర్థాల సహ-ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించి, వ్యర్థాల స్వీకరణ, నిల్వ, నిర్వహణ, సహ-ప్రాసెసింగ్ ప్రక్రియలను ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. హానికర వ్యర్థాలను నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా చట్టబద్ధంగా సహ-ప్రాసెసింగ్ చేస్తున్నారా అనే అంశాన్ని పరిశీలించిన చైర్మన్.. సంబంధిత రికార్డులు, నిర్వహణ వివరాలను అధికారులతో కలిసి ధృవీకరించారు. పరిశ్రమకు సంబంధించిన హానికర వ్యర్థాల నిర్వహణ సమాచారాన్ని ఏపీఈఎంసీఎల్ పోర్టల్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యర్థాల స్వీకరణ నుంచి నిల్వ, రవాణా, నిర్వహణ, సహ-ప్రాసెసింగ్ వరకు ప్రతి దశను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిబంధనల అమలులో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే హానికర వ్యర్థాల రవాణా, కదలికలను పర్యవేక్షించేందుకు వినియోగిస్తున్న జీపీఎస్ ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థ పనితీరును కూడా ఆయన తనిఖీ చేశారు. వ్యర్థాల రవాణాలో పారదర్శకత, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిశ్రమ ప్రాంగణంలో చైర్మన్ మొక్కను నాటారు. పరిశ్రమ పరిసరాల్లో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని యాజమాన్యానికి సూచించారు. ఈ పరిశీలనలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఈఈ సుధా కురుబ, ఏపీఈఎంసీఎల్ అధికారులు, సిబ్బంది, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com